క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత

చొప్పదండి: మండలంలోని వెదురుగట్టకు చెందిన ఎస్ మల్లారెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను సంప్రదించాడు. రూ. లక్ష ఎల్‌వోసీని ఎమ్మెల్యే బాధితుడికి అందించారు. నిరుపేదలకు సీఎం కార్యాలయం ద్వారా అందించే ఎల్‌వోసీ ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వీణవంక: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వల్బాపూర్ గ్రామంలో బాల వికాస ఆధ్వర్యంలో హన్మకొండలోని లక్ష్మీనరసింహా హాస్పిటల్ వైద్యులు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రఘుపాల్‌రెడ్డి మాట్లాడుతూ... వానాకాలంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉపసర్పంచ్ కవిత, జీపీ కార్యదర్శి రాజుందర్, వైద్యులు తేజశ్విని, నిక్కత్, పీఆర్‌వోలు సుభాష్, శ్రీకాంత్, ఉన్నారు.

సన్మానం

రామడుగు: బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను శుక్రవారం మండలంలోని బీజేపీ నాయకులు కరీంనగర్‌లో కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, అంజిబాబు, తిరుపతి, మునీందర్, రాజమల్లు, అంజయ్య, కమలాకర్, తిరుపతి, బాలయ్య, మహేశ్, రమేశ్ పలువురు పాల్గొన్నారు.

నియామకం

గన్నేరువరం: మండలంలోని చాకలివానిపల్లె గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బామండ్ల విద్యాసాగర్ నియామకమయ్యారు. ఈమేరకు పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి శుక్రవారం మండలకేంద్రం గన్నేరువరంలో సాగర్‌కు నియామకపత్రం అందజేశారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొలుపుల రవీందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, యూత్ అధ్యక్షుడు అజయ్, నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

హుజూరాబాద్: పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాముయాదవ్ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాలతో అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ సర్కారు విద్యా రంగాన్ని పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, బకాయిలు విడుదల చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రాజేశ్,నాగ, వంశీ, సందీప్, వినయ్ పాల్గొన్నారు.

ఎన్‌క్యూఏఎస్ బృందం తనిఖీ

జమ్మికుంట: పట్టణంలోని జమ్మికుంట-2 హెల్త్ వెల్నెస్ కేంద్రాన్ని నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్యూఏఎస్) బృందం డాక్టర్ ప్రితీశ్ సూర్యకాంత్ లోగడే, డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాలు, రికార్డులు, జన ఆరోగ్య సమితి సమావేశాలు, సీజనల్ వ్యాధుల రికార్డులు, హెల్త్ వెల్నెస్ కేంద్రం పరిశుభ్రత, ఆన్‌లైన్ డాటాతోపాటు మరిన్ని అంశాలను పరిశీలించారు. కరీంనగర్ జిల్లాలో 97 హెల్త్ వెల్నెస్ సెంటర్స్ ఉన్నాయని, ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికేషన్ కోసం రాష్ట్ర సాయి అధికారుల సూచనల మేరకు నాణ్యతా ప్రమాణాలు లెక్కించడం జరుగుతుందన్నారు. హెల్త్ వెల్నెస్ కేంద్రంలో 100కు 75 మార్కులు సాధిస్తే జాతీయ స్థాయి ప్రశంసాపత్రం, రూ.లక్షాఇరవై ఎనిమిదివేల పారితోషికం ఇస్తుందని, కేంద్రాల ప్రగతిపై ప్రతి సంవత్సరం తనిఖీచేసి పారితోషకం, ప్రశంసాపత్రాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ శ్రీలత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, వావిలాల పీహెచ్‌సీ వైద్యులు సన జవేరియా, హెల్త్ వెల్నెస్ కేంద్రం వైద్యులు మహోన్నత పటేల్ అపర్ణ, హిమబిందు, ఎస్ వివేకనందరెడ్డి, డీపీఓ తులసి రవీందర్, క్వాలిటీ మేనేజర్ సాగర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకర్‌రెడ్డి, జిల్లా సబ్ యూనిట్ ఆఫీసర్ రామనాథం, సూపర్‌వైజర్లు రత్నకుమారి, అరుణ, సదానందం, అనిల్‌కుమార్, శ్రీకాంత్ ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

రైతులకు తీరని కష్టాలు

- వర్షాలతో చెక్‌డ్యాంలకు గండ్లు
- పంటపొలాల్లో మీటరున్నరకు పైగానే కోతలు
- భారీగా ఇసుక మేటలు
- సాగుకు నోచుకోని వైనం





చెక్‌డ్యాంల వద్ద గండి పడిన, కొట్టుకుపోయిన పంటపొలాల దృశ్యాలు

రామడుగు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో మోతె వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. . భారీ చెక్‌డ్యాంల్లోకి ఒక్కసారిగా వరదనీరు రావడంతో పక్కలకు గండి పడి రైతుల పంట పొలాల్లో దాదాపు మీటరు నుంచి మీటరున్నర మేర మట్టి కొట్టుకుపోయి పంట పొలాలు పనిరాకుండా పోయాయి. లక్షలు విలువ చేసే పంటపొలాలకు తీరని నష్టం వాట్టిల్లిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోరటపల్లి, మోతె, కొత్తపల్లి, వన్నారం గ్రామాల పరిధిలో ప్రధానంగా భూగర్భజలాలు పెంచడం కోసం, అంతేకాకుండా నీటిని గ్రామాల చెరువులు, కుంటలకు మళ్లింపునకు ఐదు చెక్‌డ్యాంలను ఐదేళ్లక్రితం నిర్మించారు. కానీ ఈ చెక్‌డ్యాంలు ఇప్పుడు రైతుల పాలిట శాపంలా మారాయి. భారీ వర్షాలకు నారాయణపూర్ రిజర్వాయర్‌కు గండిపడి గతేడాది రెండు నుంచి మూడెకరాల పంటపొలాలు కొట్టుకుపోయాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కోరటపల్లి, మోతె, కొత్తపల్లి, వన్నారం గ్రామాల్లోని చెక్‌డ్యాంల వద్ద యాభై ఎకరాలకు పైగానే నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. పంటలు పండించుకునే పొలాలు ఇలా గండిపడి సాగుకు నోచుకోని దుస్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూడ్చలేని పరిస్థితి...

చెక్‌డ్యాంల వద్ద గండ్లు పడి పంట పొలంలోని మట్టి మీటరుకు పైగానే మట్టి కొట్టుకుపోవడంతో మళ్లీ సాగుకు పూడ్చుకోలేని పరిస్థితి తయారైందని మోతె సర్పంచ్ అంబటి నారాయణ తెలిపారు. మట్టి నింపుకోవాలంటే ఎకరానికి రూ. లక్షలకుపైగానే ఖర్చయ్యే అవకాశం ఉందన్నారు.

రూ. 4 కోట్లతో ప్రతిపాదనలు...

గతేడాది చెక్‌డ్యాంల వద్ద మట్టి కొట్టుకపోయిన పంట పొలాల్లో తిరిగి మట్టిని నింపి రైతులు సాగు చేసుకోవడానికి వీలుగా తయారు చేయడానికి అధికారులు రూ. 4 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కాగా నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. ఇటీవల నష్ట పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని అధికారులు వివరించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



మా గ్రామ పరిధిలో ఉన్న రెండు చెక్‌డ్యాంలతో రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. చెక్‌డ్యాంల పక్కనున్న పంట పొలాలు గండి పడి ఎందుకు పనికిరాకుండా పోయాయి. రైతులకు తీరని నష్టం కలిగింది. ముప్పై గుంటల పొలం పనిరాకుండా పోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– అంబటి నర్సింగరావు, రైతు,మోతె

న్యాయం చేయాలి



ఊరి సమీపంలోని మోతె వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంతో తీరని నష్టం కలిగింది. గుంటకు రూ. మూడు లక్షలు పెట్టినా దొరకని వ్యవసాయభూమి పూర్తిగా గండి పడి కొట్టుకుపోయింది. ఏం చేయాలో తెలియని పరిస్థితి. అధికారులు క్షేత్రసాయిలో పరిశీలించి న్యాయం చేయాలని వేడుకుంటున్నా.

– వరాల మనోహర్, రైతు, వన్నారం

సర్వాయి పాపన్నకు నివాళి

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బహుజనుల కోసం పోరాడిన వీరుడని కొనియాడారు. పాపన్న పోరాట తీరు, ప్రజల పట్ల ఆయన చూపిన ఆధరాభిమానాలను నాయకులు గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చొప్పదండిలో నివాళి అర్పిస్తున్న గీత కార్మికులు, తదితరులు



హుజూరాబాద్‌లో..



చిగురుమామిడిలో గౌడ సంఘం నాయకులు



తిమ్మాపూర్: పొలంపల్లిలో..



ఇల్లందకుంట: కేక్ కట్‌చేస్తున్న తహసీల్దార్ రాణి



మానకొండూర్‌లో...



రామడుగు మండల కేంద్రంలో..

భూములు కేటాయించాలని చర్మకారుల ధర్నా



ధర్నా చేస్తున్న చర్మకారులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ శివారులో చర్మకారులకు కేటాయించిన లెదర్ పార్కు భూములను ప్రభుత్వం అభివృద్ధి చేయకపోవడాన్ని నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం చర్మకారుల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న చర్మకారులకు లెదర్ పార్కుకు కేటాయించిన భూముల్లో ఎకరం వ్యవసాయం, రెండు గుంటలు నివేశన స్థలం కోసం కేటాయించాలని, లిడ్‌క్యాప్ శిక్షణ పొందిన కార్మికులను ఆదుకోవాలని కోరారు.

ఎఫ్‌పీవో సద్వినియోగం చేసుకోవాలి

గన్నేరువరం: రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు డీడీఎం జయప్రకాశ్, జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఆత్మ పీడీ ప్రియదర్శిని అన్నారు. ఖాసీంపేట రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సు, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. సంస్థ ద్వారా పంటను నేరుగా విక్రయించుకోవడం, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ నిర్వహించుకోవచ్చన్నారు. దళారి వ్యవస్థ ఉండదని దీంతో మార్కెట్ ధరకే రైతులకు లబ్ధి జరుగుతోందని తెలిపారు. సంస్థలో సభ్యత్వ నమోదుకు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుందని, రైతు, రైతు కూలీ, రైతు సంబంధిత కుటుంబం వంటి అర్హతలు ఉండాలని వివరించారు. మండలంలోని 750 మంది రైతులు రూ. 2 వేలతో సభ్యత్వం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. సభ్యత్వం మొత్తం డబ్బులు రూ.15 లక్షలతో ఎఫ్‌పీవో సంస్థగా గుర్తించిన అనంతరం నా బార్డు రూ. 15 లక్షలను ఇందులో జమ చేస్తోందని వివరించారు. మొత్తం రూ.30 లక్షలు రైతు సంక్షేమం, అభివృద్ధికి ఖర్చు చేయాల్సి ఉంటుందని, చిన్న పరిశ్రమ, వ్యాపారం చేసుకుని లాభాలు పొందడమే ఉద్దేశమని వెల్లడించారు. సంస్థలో సీఈవో, అకౌంటెంట్, 10 డైరెక్టర్లు కలిసి సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలి పారు. కార్యక్రమంలో ఏవో కిరణ్మయి, హార్టికల్చర్ అధికారి స్వాతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకన్న, ఆత్మ బీటీఎం సునీల్, సీఈవో కర్ర అనూషరెడ్డి, ఏఈవో అనూషరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

‘గృహలక్ష్మి’పై అధికారుల సర్వే



మానకొండూర్: సర్వే చేస్తున్న వెంకటేశ్వర్లు



రామడుగు: వెలిచాలలో..

గంగాధర: గృహలక్ష్మి పథకంలో లబ్ధిదారుల ఎంపికకు అధికారులు క్షేత్ర స్థాయి సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని గర్శకుర్తి గ్రామంలో శుక్రవారం ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా ఇతర సిబ్బంది సర్వే చేశారు. గ్రామాల వారీగా సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసిన తరువాత విడతల వారీగా రూ.మూడు లక్షలు మంజూరు చేస్తామని ఎంపీడీవో పేర్కొన్నారు.

మానకొండూర్: మండలంలో 2,171 దరఖాస్తులు రాగా, ఎంపీడీవో, వ్యవసాయాధికారి, తహసీల్దార్, మండల పంచాయతీ అధికారి నాలుగు టీంలుగా ఇంటింటి సర్వే చేస్తున్నారు. లలితాపూర్, పచ్చునూర్, వన్నారం, గంగిపల్లి గ్రామాలలో దరఖాస్తుదారుల అధికారులు వివరాలు సేకరించారు. గంగిపల్లి గ్రామంలో మండల ప్రత్యేకాధికారి, అదనపు డీఆర్డీవో వెంకటేశ్వర్లు సర్వేలో పాల్గొని వివరాలు తెలుసుకున్నారు.

అర్హులందరికీ అవకాశం

అర్హులైన ప్రతి ఒక్కరికి గృహలక్ష్మి పథకం కింద ఇళ్ల నిర్మించుకునే అవకాశం ఉందని, సీనియర్ సిటిజన్ బీఆర్‌ఎస్ నాయకుడు పొలాడి రామారావు అన్నారు. మండలంలోని వన్నారంలో అధికారులు గృహలక్ష్మి సర్వే చేశారు. సర్వేలో పాల్గొన్న అనంతరం రామారావు మాట్లాడారు.

రామడుగు: మండలంలోని పలు గ్రామాలలో ఇంటింటికి వెళ్లి అధికారులు వివరాలను సేకరిస్తున్నారు. మండలంలోని వెలిచాలలో అధికారులు దరఖాస్తుదారుల వివరాలను నమోదు చేసుకొని పరిశీలిస్తామని తెలిపారు.

గన్నేరువరం: మండల పరిషత్, రెవెన్యూ, ఐకేపీ అధికారులు గ్రామాల్లో సర్వే చేపట్టారు. మండలంలో 1,039 గృహలక్ష్మి దరఖాస్తులు వచ్చాయని సర్వే కొనసాగుతోందని అధికారులు తెలిపారు. పారువెల్ల, మాదాపూర్ గ్రామాల్లో ఎంపీడీవో స్వాతి, జంగపల్లిలో ఏపీఎం లావణ్య, అలాగే గన్నేరువరంలో రెవెన్యూ అధికారులు సర్వేలో పాల్గొన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని, దరఖాస్తుదారులు అందుబాటులో ఉండాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి



పీఆర్టీయూ సభ్యత్వ నమోదులో టీచర్లు, నాయకులు

చిగురుమామిడి: రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ ఎనలేని కృషి చేస్తుందని త్వరలోనే ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రానుందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందుర్తి, రేకొండ జెడ్పీపాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు పదోన్నతి, బదిలీలు లేక అవస్థలు పడుతున్నారని, ఐఆర్‌తో కూడిన పీఆర్‌సీ, ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డులు పనిచేయక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దుబ్బాక బాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దొమ్మాట కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పన్యాల రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు రఘుపతిరెడ్డి, శంకర్, రమేశ్, జిల్లా బాధ్యులు విక్రం, లింగారెడ్డి, మల్లేశం, శేఖర్ పలువురు పాల్గొన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మానకొండూర్: కరీంనగర్ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2023- 2024 విద్యా సంవత్సరానికి ఖాళీ సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని దేవంపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీఈవో అలుగునూర్‌లో బైపీసీ 5, చింతకుంట ఎంఈసీ 24, సీఈసీ 2, చొప్పదండి సీఈసీ 09, హుజూరాబాద్ ఎంపీసీ 14, బైపీసీ 10, మానకొండూర్ ఎంపీసీ 5, బైపీసీ 15, జమ్మికుంట ఎంపీసీ 10, బైపీసీ 32 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని కోరారు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట: భూ వివాదంలో దాడికి పాల్పడిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామానికి చెందిన జువ్వాజి సురేందర్ వ్యవసాయ భూమిలోకి అదే గ్రామానికి చెందిన కాసర్ల రాజేశ్, బోళ్ల కుమారస్వామి అక్రమంగా చొరబడి, బూతులు తిట్టి దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

చంపుతామని బెదిరించిన ఘటనలో..

వ్యవసాయ మోటార్ ధ్వంసం చేసి చంపుతామని బెదిరించిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేశామని జమ్మికుంట టౌన్ సీఐ బార్పటి రమేశ్ శుక్రవారం తెలిపారు. జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామానికి చెందిన శ్రీరామోజు మహేందర్, తాళ్ల ప్రభాకర్ ఇద్దరికి వ్యవసాయబావి పొత్తులో ఉండగా నీళ్ల పెట్టుకునే క్రమంలో మహేందర్‌కు చెందిన వ్యవసాయ మోటార్, పైపులైన్ ధ్వంసం చేసి బావిలోని నీల్లు పెట్టుకుంటే చంపుతామని తాళ్ల ప్రభాకర్, పద్మ, మనోహర్, మహేందర్ నలుగురు బెదిరించారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

● **ఎన్నికలప్పుడే పథకాలు గుర్తుకొస్తాయి**

సైదాపూర్: సాధారణ, ఉపఎన్నికలు వచ్చినప్పుడే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పథకాలు గుర్తుకువస్తాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఉద్యమాలతోనే రుణమాఫీ అమలు చేశారన్నారు. శుక్రవారం వెంకటేశ్వర్లపల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో మాట్లాడారు.

● **రూ. 1.30 కోట్లతో అభివృద్ధి పనులు**

చొప్పదండి: చొప్పదండి వ్యవసాయ మార్కెట్ ద్వారా రూ. 1.30 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆదాయం పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని, వానాకాలంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించేందుకు తీర్మానం చేశామని వివరించారు.


● **వరిపొలాలను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్త**

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి గ్రామంలో శుక్రవారం కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి వరిపొలాలను పరిశీలించారు. పంటకు మొగిపురుగు సోకకుండా ఎకరానికి పది కేజీల కార్బోఫ్యూరాన్ చల్లుకోవాలని ఆయన సూచించారు. ఏవోశ్రీనివాస్, ఏఈవోరాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.


అర్హులందరికీ పథకాలు అమలు చేయాలి

గంగాధర: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందంటే అర్హులందరికీ పథకాలు అమలుయాలని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు, సుద్దాల దేవయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. దళితబంధు, బీసీబంధు, మైనార్టీ బంధుతో పాటు గృహలక్ష్మి పథకం అమలు చేయడంలో విఫలమైందన్నారు. అర్హులకు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు రాస్తారోకోను విరమింపజేశారు. ధర్నాలో నాయకులు ప్రభాకర్‌యాదవ్, శ్రావణ్‌కుమార్, రామానుజం, కళ్యాణ్, శశిధర్‌రెడ్డి, అశోక్,రవీందర్‌రెడ్డి, నరసింహారెడ్డి, మహేందర్, రేండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: రజాకార్లను తలపించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సాగిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి ఆరోపించారు. ఎన్నికల హామీలు నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులపై పోలీసులతో దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన హక్కును పోలీసుల సాయంతో కేసీఆర్ సర్కార్ హరిస్తోందని విమర్శించారు. పార్టీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు కరీంనగర్, మానకొండూర్ నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో అల్గునూర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. నిరసనలో పాల్గొన్న నాయకులపై పోలీసులు దాడిచేశారని ఆరోపించారు. అమర్యాదగా ప్రవర్తించడం సమంజసంకాదని, ప్రజల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే క్రమంలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు ఉందన్న సంగతి పోలీసులు మర్చిపోవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రెడ్డి, సత్యనారాయణ, రమేష్, రాజేంద్రప్రసాద్ , ఎల్లన్న, నాగరాజు అజయ్ వర్మ వాసుదే వారెడ్డి శ్రీనివాస్‌గౌడ్ జగన్ రెడ్డి, శ్రీనివాస్, జగదీశ్వర్ చారి పలు మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు



అలుగునూర్ చౌరస్తాలో...